రేషన్ పంపిణీ 89.71 శాతం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జూన్ నెలలో ఎండీయూ వాహనాల స్థానే చౌక దుకాణాల ద్వారా చేపట్టిన నిత్యావసర వస్తువుల పంపిణీ ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. 5,36,686 రేషన్ కార్డులుండగా 4,81,507 కార్డులకు, పోర్టబిలిటీ ద్వారా 94,861 కార్డులకు డీలర్లు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఎండీయూ వాహనాల ద్వారా గతంలో 85-88 శాతం మధ్యలో పంపిణీ జరుగుతుండేది. ఈనెలలో 89.71శాతం రేషన్ పంపిణీ జరిగింది.

సివిల్ సప్లయిస్ డీఎంగా లక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ (సివిల్ సప్లయిస్ డీఎం) బాలకృష్ణను ప్రభుత్వం తిరుపతి జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా మేనేజర్ లక్ష్మిని నియమించారు.

తండ్రిపై కోపంతో చిన్నారిని కొట్టిన అంగన్వాడీ టీచర్



బాధితుడు రుద్రప్రసాద్

పాలసముద్రం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై కోపంతో చిన్నారిని కొట్టారో అంగన్వాడీ టీచర్. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పాలసముద్రం మండలంలోని టీవీఎన్ఆర్పురం అంగన్వాడీ కేంద్రం సరిగా తెరవడం లేదని నిరసిస్తూ గత శుక్రవారం ఆ కేంద్రానికి సర్పంచ్ అమరావతి సమక్షంలో గ్రామస్తులు తాళం వేశారు. దీనిపై ఈ విషయం అన్ని పత్రికల్లోనూ ప్రచురితమైంది. ఈ అంశంపై శనివారం సాయంత్రం గంగాధరనెల్లూరు సీడీపీవో పద్మసునంద విచారణ చేపట్టి, సిబ్బందికి మెమో జారీ చేస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో తనపై రుద్రప్రసాద్ తండ్రి గణేష్ ఫిర్యాదు చేశాడని అంగన్వాడీ టీచర్ మునిలక్ష్మి కోపం పెంచుకుంది. ఆ కోపంతో సోమవారం కేంద్రానికివచ్చిన రుద్రప్రసాద్ను ఆయా చంద్రమ్మ కోడలితో కలిసి వాతలు తేలేలా కొట్టారు.ఆ చిన్నారి ఏడుస్తూ ఇంటికొచ్చి తల్లిదండ్రులకు విషయం తెలిపాడు. ఈ విషయమై మధ్యాహ్నం సీడీపీవోకు గ్రామస్తులతో కలిసి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అంగన్వాడీ టీచర్ను, ఆయా చంద్రమ్మ కోడలిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆధార్ అప్డేట్ కానివారు 13,758 మంది

వీరికోసం 24-27 తేదీల మధ్య ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్డేట్ చేసుకోనివారు జిల్లాలో 13,758 మంది ఉన్నారని అధికారులు గుర్తించారు. ఇటువంటి వారిలో అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రేషన్కార్డుల్లో పేర్ల నమోదుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చాలాచోట్ల పిల్లల చేతివేళ్లు, ఐరిష్ అప్డేట్ చేసుకోలేదని తెలిసింది. దీనివల్ల తాజాగా తల్లికి వందనం పథకానికి కూడా చాలామంది అర్హులు దూరమయ్యారు. ఇటువంటి వారికోసం ఈనెల 24నుంచి 27వ తేదీవరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించాలని జీఎస్డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టింది. జిల్లాలో 122 సచివాలయాల్లో శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

డీవైఈవోగా వెదురుకుప్పం ఎంఈవో

వెదురుకుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పుత్తూరు డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈవో)గా వెదురుకుప్పం ఎంఈవో టి.మహేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను పుత్తూరు డీవైఈవో (ఎఫ్ఏసీ)గా నియమించారు. కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ముందు రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏరియల్ సర్వే రద్దుతో వెనుదిరిగిన అధికారులు

కోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): క్రిస్సిటీ భూములు.. పనులకు సంబంధించి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఏరియల్ సర్వే రద్దవడంతో అధికారులు వెనుదిరిగారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కలెక్టర్ వెంకటేశ్వర్తో కలిసి సోమవారం ఉదయం ఆయన కోట మండలం కొత్తపట్నం, చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తారని స్థానిక అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, ఏపీఐఐసీ అధికారులు క్రిస్సిటీ భూములకు చేరుకున్నారు. ఏరియల్ సర్వే జరుగుతుందని నిరీక్షించారు. చివరి క్షణంలో హెలికాప్టర్లో సాంకేతిక లోపంవల్ల పర్యటన రద్దవడంతో వీరంతా వెనుదిరిగారు.

ఫ్యాక్టరీలన్నీ తెరిస్తేనే మామిడి రైతులకు ప్రయోజనం

- గుజ్జు పరిశ్రమల వద్ద నిరసనల పర్వం
- ర్యాంపుల్లోనూ పెరిగిన నిఘా



తవణంపల్లి మండలం కామాలూరు వద్ద సిద్ధార్థ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్, ఉద్యాన శాఖ ఏడీ కోటేశ్వరరావు

చిత్తూరు సెంట్రల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తోతాపురి రకం మామిడి కాయలకు ధర రావాలంటే జిల్లాలోని గుజ్జు ఫ్యాక్టరీలన్నీ పనిచేయడమే మార్గంగా కనిపిస్తోంది. సీజన్ ప్రారంభమై పంట చేతికి వచ్చి పక్షం రోజులు గడుస్తున్నా, పరిశ్రమలన్నీ పనిచేయకపోవడం, తెరుచుకున్న పరిశ్రమల యాజమాన్యాలపై మామిడి కొనుగోళ్లకు రైతులు ఒత్తిడి పెంచడం తదితర పరిణామాలతో పరిస్థితులు గందరగోళంగా మారాయి. తోతాపురికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వారం రోజులు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు కాకుండా పోవడం రైతుల్లో నిరాశను పెంచుతోంది. జిల్లాలో 39 గుజ్జు పరిశ్రమలుండగా, 15 ఫ్యాక్టరీలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. మరో 14 ఫ్యాక్టరీలు అటూఇటుగా పనిచేస్తున్నాయి. 6 ఫ్యాక్టరీలు తెరచుకోలేదు. ఫ్యాక్టరీలన్నీ తెరిపించే క్రమంలో అధికార యంత్రాంగం ఆయా ఫ్యాక్టరీల్లోని సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశాయి.



ఆర్ఎంఎం ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

సామర్థ్యానికి మించి కొనలేం

ఒక్కో ఫ్యాక్టరీ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 150 టన్నులు కాగా, 30 ట్రాక్టర్ల మామిడి కాయలు అవసరం . ఇందుకు భిన్నంగా ఒక్కో ఫ్యాక్టరీకి 50 ట్రాక్టర్లకు పైగా మామిడి కాయలను తరలిస్తుండడంతో ఫ్యాక్టరీ యాజమాన్యాలు రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నాయి. చిత్తూరు సమీపంలోని ఆర్ఎంఎం ఫ్యాక్టరీ యాజమాన్యం ఈనెల 30వ తేదీ వరకు రైతులకు టోకెన్లు ఇచ్చింది. ఇదే బాటలో బంగారుపాళ్యం సమీపంలోని నలగాంపల్లె సన్గోల్డు ఫ్యాక్టరీ యాజమాన్యం టోకెన్లు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మామిడి కాయలను తీసుకువచ్చిన రైతులు వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రెండు ఫ్యాక్టరీల ముందు ధర్నాకు దిగారు. స్టాక్ అధికంగా కొనుగోలు చేసినందున రెండు రోజుల పాటు మామిడిని తేవద్దంటూ గంగాధరనెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు సూచించింది.


స్థిరంగా టేబుల్ వెరైటీల ధరలు

ఇటు ఫ్యాక్టరీల్లో, అటు మండీల్లో మామిడి ధరలు ఒకే రకంగా కొనసాగుతున్నాయి. గుజ్జు పరిశ్రమలు తోతాపురి టన్ను రూ.5వేల నుంచి రూ.6 వేల మధ్య కొనుగోలు చేస్తున్నాయి. ఇక చిత్తూరు, బంగారుపాళ్యం మండీలకు రోజువారీ వచ్చే టేబుల్ వెరైటీ మామిడి ధరలు వారం రోజులుగా స్థిరంగా వున్నాయి. బేనీషా రూ.20, బేనీషా (కలర్) రూ.25, కాలేపాడు రూ.25, మల్లిక రూ.30, హిమామ్ పసంద్ రూ.70, మల్గూబా రూ.40, తోతాపురి (లైనింగ్ కలర్) రూ.13 పలుకుతున్నాయి.

ర్యాంపుల వద్ద పెరిగిన నిఘా

జిల్లాలో 39 ర్యాంపులు ఉండగా, మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటి వరకు 25 ర్యాంపులకు లైసెన్స్లు అందజేశారు. వీటిలో మామిడి కొనుగోళ్ల ప్రారంభించడంతో అధికారులు నిఘా పెంచారు. ర్యాంపుల వద్ద నాణ్యమైన కాయలకే తప్ప మిగిలిన వాటికి ధరలు లేకపోవడంతో తాము తెచ్చిన కాయలు అమ్ముడుపోతే చాలనే దృష్టితో గిట్టుబాటు ధర అటూ, ఇటుగా అమ్మేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.

రెండు రోజులు కాయలు తీసుకురాకండి



గొల్లపల్లె జైన్ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటుచేసిన నోటీసు బోర్డు

గంగాధరనెల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పంచాయతీ 100గొల్లపల్లె వద్ద వున్న జైన్ఫ్యాక్టరీ -1 ప్లాంట్ వద్ద సుమారుగా 220 ట్రాక్టర్ల మామిడికాయల లోడ్లు, అదేవిధంగా తూగుండ్రం రహదారిలో వున్న జైన్ఫ్యాక్టరీ -2 ప్లాంట్ వద్ద సుమారు 170 ట్రాక్టర్ల మామిడి కాయలలోడ్లు పడిగాపులు కాస్తున్నాయి. ఈ రెండు ఫ్యాక్టరీల వద్ద ఉన్న మామిడికాయలు అన్లోడింగ్ చేయాలంటే మంగళవారం రాత్రి దాకా పడుతుందని అంచనావేశారు. దీంతో సోమవారం జైన్ఫ్యాక్టరీ ప్లాంట్ల వద్ద సోమ,మంగళవారాల్లో రైతులు ఎవరూ కూడా తోతాపురి మామిడికాయలను కోయకుండా సహకారం అందించాలని పేర్కొంటూ నోటీస్బోర్డులను ఏర్పాటు చేశారు. బుధవారం మామిడికాయలను తీసుకురావచ్చని విజ్ఞప్తి చేశారు.

మద్దతు ధర చెల్లించాల్సిందే

నిబంధనలు ఉల్లంఘిస్తే ర్యాంపులను సీజ్ చేస్తాం



ఎల్లంకివారిపల్లి ర్యాంపు వద్ద తనిఖీలు

కల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన ధరను రైతులకు వ్యాపారులు చెల్లించాల్సిందేనని మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ నిరంజన్రెడ్డి, తహశీల్దార్ జయసింహ చెప్పారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలోని ఓ ర్యాంపు వద్ద సోమవారం ప్రభుత్వ నిబంధనల మేరకు తోతాపురి మామిడి కొనుగోలు చేయకపోవడంపై సాయిరాం మామిడి ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మునికృష్ణమ నాయుడు పలువురు రైతులతో కలెక్టర్ను కలిశారు. సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎల్లంకివారిపల్లి ర్యాంపు వద్దకెళ్లి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ర్యాంపు వద్దకు చేరుకొని యజమానితో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరను రైతులకు తప్పక చెల్లించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే ర్యాంపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ప్రభుత్వం తోతాపురికి కిలో రూ:4 చెల్లించేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని, గుజ్జు పరిశ్రమ యజమానులు, ర్యాంపు యజమానులు, వ్యాపారులు రైతులకు సహకరించాలని తెలిపారు.

పర్మిట్ల కోసం జాతీయ రహదారిపై ధర్నా




నలగంపల్లి వద్ద రోడ్డుపై మామిడి రైతుల ధర్నా

బంగారుపాళ్యం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుజ్జు పరిశ్రమ యాజమాన్యం పర్మిట్లు ఇవ్వకపోవడంతో సోమవారం ఉదయం మామిడి రైతులు చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై నలగాంపల్లె వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము పండించిన మామిడిని అమ్ముకోలేక ఫ్యాక్టరీలు వద్ద పడిగాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా యాజమాన్యాలు పట్టించుకోవడంలేదన్నారు. నలగాంపల్లెలోని సన్ గోల్డ్ గుజ్జు పరిశ్రమ యాజమాన్యం రైతులకు పర్మిట్లు ఇస్తామని ప్రకటించడంతో సోమవారం ఉదయం పెద్దఎత్తున రైతులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. కొందరికే పర్మిట్లు ఇస్తామని చెప్పడంతో రాస్తారోకోకు దిగారు. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ తన సిబ్బందితో సంఘటన చేరుకుని రైతులకు నచ్చజెప్పి, రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, సీఐ కత్తి శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడి మామిడి రైతులకు పర్మిట్లను మంజూరు చేయించారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీల వేళాయె!

ఐదేళ్లయితే తప్పనిసరి ● నిబంధనలు విడుదల చేసిన ప్రభుత్వం



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీలకు వేళైంది.దీంతో ఇన్నాళ్లూ సొంత మండలాల్లో తిష్టవేసిన సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా వేరే మండలానికి వెళ్లాలిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సొంతూరులో పనిచేయకూడదనే నిబంధన ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం సొంత మండలంలోనూ ఉద్యోగం చేసేందుకు వీలులేకుండా మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో వైసీపీ నాయకులను ప్రసన్నం చేసుకుని సొంత మండలాల్లో, సమీప గ్రామాల్లో పనిచేస్తూ వచ్చిన ఉద్యోగులు కుర్చీలు ఖాళీచేయాల్సి వస్తోంది. దూరం వెళ్ళేందుకు ఇష్టంలేక గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పొరుగు మండలాల్లో పోస్టింగ్స్ పొందేందుకు సిఫార్సులేఖల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఐదేళ్లయితే తప్పనిసరి

వైసీపీ ప్రభుత్వం 2019 అక్టోబరు 2 నుంచి సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ఏడాదికో, రెండేళ్ళకో బదిలీల ప్రక్రియ చేపట్టాల్సివుండగా... పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులంతా చేరిన రోజు నుంచి ఒకేచోట పని చేస్తూ వస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరులో జరిగిన సాధారణ బదిలీల సమయానికి సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్ళు నిండలేదు. రిక్వెస్ట్ పెట్టుకోవడానికి అవకాశం ఇవ్వడంతో 15-20 శాతం మధ్య ఉద్యోగులకే స్థానచలనం కలిగింది. తాజాగా ఇచ్చిన బదిలీల జీవోతో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారందరికీ స్థానచలనం కలుగనుంది. 2025 మే నెలాఖరుకు ఒకే చోట ఐదేళ్ళకు పైగా పనిచేస్తుంటే బదిలీ తప్పనిసరి నిబంధనతో 70-80 శాతం మంది బదిలీ కానున్నారు.

వివరాలు

జిల్లాలో సచివాలయాలు	612
గ్రామాల్లో	504
వార్డుల్లో	108
ఉద్యోగులు	4300 మంది

నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి

బదిలీల ప్రక్రియ ఈ నెలాఖరు లోపు పూర్తిచేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 4300 మంది 612 గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్నారు. ఈనెల 16 నుంచి 18 తేదీల మధ్య ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఉద్యోగుల వర్కింగ్ స్టేజిని ఆన్లైన్లో నమోదుచేస్తారు. 21వ తేదీలోగా ఆయా హెచ్ఓడీలు తమ వద్ద ఉన్న సచివాలయ ఉద్యోగుల ఎస్ఆర్లను లాగిన్ ఆధారంగా వారి సొంత మండలాలను గుర్తిస్తారు. 22న వెబ్ ఆప్షన్ ఇస్తారు. 22-26 తేదీల మధ్య ఐదేళ్ళు నిండిన ఉద్యోగులు తమకు కావాల్సిన స్థానానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిని ఈనెల 30న కలెక్టర్ పరిశీలించి బదిలీల ఉత్తర్వులను జారీచేస్తారు.

గ్రేడ్లవారీగా విభజన

జనాభా, ఆదాయం ఆధారంగా గ్రామ పంచాయతీలను గ్రేడ్ల వారీగా విభజించేందుకు ఇప్పటికే ప్రతిపాదించారు. పౌరసేవలను సులభతరం చేసేందుకు సచివాలయాలను క్లస్టర్లుగా విభజించనున్నారు. సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణతో పాటు ఒకేసారి బదిలీలు చేపట్టనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో సచివాలయానికి 8 నుంచి 11 మంది ఉద్యోగులను నియమించారు. చాలాచోట్ల ఉద్యోగులు ఖాళీగా ఉండేవారు. ఇప్పుడు పనినిబట్టి ఉద్యోగులను నియమించనున్నట్లు సచివాలయాల నిర్వహణ కోఆర్డినేటర్ రవి కుమార్ తెలిపారు.

ఏడుగురు మున్సిపల్ ఇంజనీర్ల విచారణ

పుంగనూరు, మదనపల్లె మున్సిపాలిటీల్లో నాసిరకం పనులపై ఆరోపణలు

విచారణాధికారిగా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్రెడ్డి

పుంగనూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు, మదనపల్లె మున్సిపాలిటీల్లో నాసిరకం పనులు జరగడంపై ఏడుగురు ఇంజనీరింగ్ అధికారులపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అనంతపురం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ ఆర్.రామ్మోహన్రెడ్డిని విచారించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. సోమవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసి విచారణ నివేదికను మూడునెలల్లోపు ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. మదనపల్లె మున్సిపల్ మాజీ డీఈఈ పీఎస్.మహేశ్, పుంగనూరు మున్సిపల్ మాజీ డీఈఈ ఎం.నారాయణస్వామి, రిటైర్డ్ డీఈఈ కేఏ.పద్మనాభరావు, మాజీ ఏఈలు ఎం.రవీంద్రరెడ్డి, బి.కృష్ణకుమార్, రిటైర్డ్ ఏఈ పి.సుబ్బరామయ్య, మదనపల్లె ఏఈ కె.గోపీనాథ్లపై వచ్చిన అభియోగాలను విచారించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉలిక్కిపడ్డ షార్!

బెదిరింపు కాల్తో విస్తృత తనిఖీలు ● ఫేక్ కాల్ చేసింది సేలంవాసిగా గుర్తింపు



షార్ లేబర్ కాలనీలో నివాసితుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

సూళ్లూరుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'షార్లో తీవ్రవాదులున్నారు. బాంబు పెట్టారు' అంటూ చెన్నై పోలీస్ కంట్రోల్ రూంకు వచ్చిన ఫోను కాల్తో షార్ ఉలిక్కిపడింది. అక్కడి పోలీసుల సమాచారంతో బాంబు స్క్వాడ్, పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన షార్లో జల్లెడ పట్టారు. రాత్రి వేళల్లో నిశ్శబ్దంగా ఉండే షార్ కేంద్రంలో సోమవారం తెల్లవారు జామున ఓ పక్క పోలీసు జీపుల సైరన్, మరోపక్క శ్రీహరికోట లోపల ఉన్న ఉద్యోగుల కాలనీ, లేబర్ కాలనీ, పలు కీలక విభాగ కార్యాలయాలు, వెలుపల రహదారుల పక్కన భద్రత దళాలతో నిండిపోయింది. పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది దాదాపు 8 గంటల పాటు షార్లో అణువణువునా గాలించారు. సముద్ర మార్గంలోనూ తనిఖీలు చేసి నిఘా పెంచారు. ఉద్యోగస్తుల వాహనాలతో పాటు షార్కు వెళ్లే కాంట్రాక్టర్లు, ప్రైవేట్ కంపెనీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల వివరాలడిగి లోపలకు పంపించారు. మరోవైపు షార్ చుట్టుపక్కల తీర ప్రాంత గ్రామాలు, సూళ్లూరుపేట పట్టణంలోనూ అలజడి నెలకొంది. చివరకు ఫేక్కాల్గా నిర్ధారించారు. తమిళనాడు పోలీసులు ఇచ్చిన ఫోను నెంబరు ఆధారంగా ఆ ఫేక్ కాల్ చేసింది సేలంకు చెందిన బాలకృష్ణన్ విజయ్బాబుగా గుర్తించారు. సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండపనాయుడు తదితరులు సేలం వెళ్లి అక్కడి పోలీసుల సాయంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మానసిక స్థితి సరిగాలేక ఇలా పలుమార్లు.. అక్కడి కార్యాలయాలకూ బెదిరింపు కాల్స్ చేసినట్లు సమాచారం. ఫేక్ కాల్ అయినప్పటికీ షార్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. లేబర్ కాలనీల్లో నివాసం ఉండే వారు తప్ప వారి బంధువులకూ అనుమతివ్వడం లేదు.



ఆర్కే రోజా, మీనా - ఇంద్రజ

శ్రీవారి సేవలో సినీతారలు

తిరుమల శ్రీవారిని సోమవారం మాజీ మంత్రి ఆర్కే రోజా, సినీనటులు మీనా, ఇంద్రజ దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. స్వామి దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన నటులను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. రోజా, మీనా తదితరులు తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం వద్ద పీయూష్ గోయల్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్

అమ్మవారి సేవలో మంత్రులు

తిరుచానూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని సోమవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్ దర్శించుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, టీటీడీజేఈవో వీరబ్రహ్మం, అర్చకులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజ స్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నటి ఇంద్రజ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- శనివారం హుండీ ఆదాయం: రూ.4.52 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,815
- తలనీలాలు సమర్పించినవారు: 35,007






డీఐపీఆర్వోగా గురుస్వామిశెట్టి - డీపీఆర్వోగా రమేష్ - జిల్లా భూగర్భ జలాల డీడీగా శోభన్‌బాబు


కలెక్టర్‌ను కలిసిన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్

కొత్త అధికారులొచ్చారు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులు సోమవారం ఆయా శాఖల కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్‌గా శోభన్‌బాబు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎంగా చంద్రశేఖర్, డీఐపీఆర్వోగా గురుస్వామిశెట్టి, డీపీఆర్వోగా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించిన వారిలో ఉన్నారు.

తుడా వీసీగా జేసీ బాధ్యతలు



తిరుపతి, జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)వీసీగా నియమితులైన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు పట్టణాభివృద్ధి సంస్థలకు వీసీలుగా జేసీలకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం తుడా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన జేసీకి ఛైర్మన్ దివాకర్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఇప్పటివరకు వీసీగా ఉన్న నగర కమిషనర్ మౌర్యకు వీడ్కోలు పలికారు.

అన్న చేతిలో తమ్ముడు హతం

సూళ్లూరుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మతకాముడి గ్రామంలో సోమవారం రాత్రి అన్న చేతిలో తమ్ముడు హత్యకు గురయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... దాయాదులైన ఇద్దరు అన్నదమ్ముల మధ్య కుటుంబ గొడవలు ఉన్నాయి. సోమవారం రాత్రి మట్టం సురేష్, అతని తమ్ముడు మట్టం మునిచంద్ర నడుమ తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకుంది. ఆవేశానికి గురైన సురేష్ ఇంట్లో ఉన్న సూరికత్తి తీసుకుని తమ్ముడు మునిచంద్ర(25)ను పొడిచాడు. కత్తి గుండెపైన గుచ్చుకోవడంతో మునిచంద్ర అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. కాగా, ఘర్షణ సమయంలో ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

తిరుపతి (నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ వైకుంఠపురంలోని ఓ ఐదంతుస్తుల భవనం పైనుంచి పబడి కూలీ సతేంద్రకుమార్‌శా (29) మృతిచెందారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఎర్ర నరసారెడ్డి నిర్మిస్తున్న భవనానికి సంబంధించి పనుల కోసం బీహార్ నుంచి మంతుశా, అతడి బావమరిది సతేంద్రకుమార్‌శాతో పాటు మరికొంతమంది కూలీలు వచ్చారు. ఆదివారం సెలవు కావడంతో పని ముగించుకుని సతేంద్రకుమార్‌శా మద్యం తాగారు. తమ వసతికి ఇచ్చిన రెండో ఫ్లోర్‌లో అందరూ పడుకుని ఉండగా.. సతేంద్రకుమార్‌శా మద్యం మత్తులో అర్ధరాత్రి నిర్మాణంలోని భవనం 5వ అంతస్తుకు నడుచుకుంటూ వెళ్లి అక్కడి లిఫ్టురూమ్‌పైకి ఎక్కి పడుకున్నారు. ప్రమాదవశాత్తు దొర్లడంతో పక్క ఇంటిలోని బైక్‌పై పడ్డారు. తీవ్ర గాయాలయ్యాయి. ఆ శబ్దానికి ఆఇంట్లోని సునీల్ కుమార్ బయటకు వచ్చి చూడగా అపస్మారక స్థితిలో సతేంద్ర కుమార్ ఉన్నారు. మిగతా కూలీలకు సమాచారం ఇచ్చి.. తన కారులోనే రుయాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించినారు, తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



తిరుపతి (నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా స్కూల్ బస్సులు, వాహనాలను పోలీసు, ఆర్టీఈ అధికారులు సోమవారం సంయుక్తంగా తనిఖీలు చేశారు. ప్రైవేట్ స్కూల్ బస్సుల రికార్డులు, పర్మిట్‌లను పరిశీలించారు. స్కూల్ బస్సుల లీగల్ కండిషన్, బస్సుల ఆర్‌సీ, బీమా, పొల్యూషన్, ఫస్ట్ ఎయిడ్ బాక్సు తనిఖీ చేవారు. డ్రైవర్ల అర్హతలే, లైసెన్సు, వాహనం నడిపే సమయంలో.. పిల్లలు బస్సు ఎక్కినప్పుడు.. దిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. స్కూల్ బస్సులకు పర్మిట్లు లేకుండా నడిపితే సీజ్ చేసి ఆర్టీవోకు పంపుతామని స్పష్టంచేశారు. స్కూల్ బస్సులు, వ్యాన్లను వేగంగా నడిపే డ్రైవర్లపైనా చర్యలు చూసుకుంటామని హెచ్చరించారు. స్కూల్ బస్సులు 40 కిలోమీటర్లకు మించి వేగం లేకుండా నడపాలన్నారు. పిల్లల భద్రత దృష్ట్యా స్కూల్ యాజమాన్యం ఎప్పటికప్పుడు డ్రైవర్లపై నిఘా పెట్టాలని ఆదేశించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తిరుపతి(వైద్యం), జూన్ 16(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే రోజూ క్రమం తప్పకుండా యోగా చేయాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని పలు ఆసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రాధా, వైస్ ప్రిన్సిపాళ్లు డీఎస్ఎన్ మూర్తి, రోజారమణి. రవీంద్ర, అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడికి పరికరాల వితరణ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంపీ నిధుల ద్వారా శ్రీకాళహస్తి మండలం అంజనేయపురానికి చెందిన విభిన్నప్రతిభావంతుడు సుబ్బరాయలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.5లక్షలు విలువైన హైడ్రాలిక్ ఫైబర్ ఫుట్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, రాజశేఖర్, రాజు, చెంచల్ భరత్ తదితరులు పాల్గొన్నారు.


హైడ్రాలిక్ ఫైబర్ ఫుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కిక్కిరిసిన కలెక్టరేట్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- పీజీఆర్ఎస్‌కు 307 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించేందుకు వచ్చిన అర్జీదారులతో సోమవారం కలెక్టరేట్ కిక్కిరిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. పదేపదే తిరుగుతున్నా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని కొందరు అధికారుల ఎదుట వాపోయారు. మొత్తం 307 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ శాఖకు 135 వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ తదితరులు పాల్గొన్నారు.

13ఏళ్లుగా ఆధార్‌కార్డు కోసం తిరుగుతున్నా..



'ఆధార్ కార్డు కోసం 13ఏళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. భర్త 40 ఏళ్ల క్రితం చనిపోయాడు. కుమార్తె బతుకుదెరువు కోసం చెన్నైకి వెళ్లింది. కూలి పనులకు పోలేక పస్తులతో కాలం గడుపుతున్నా. ఆధార్‌కార్డు లేకపోవడంతో పింఛను అందడంలేదు. మీరైనా స్పందించి న్యాయం చేయండి' అంటూ ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన కె.నాగరత్నమ్మ అధికారులకు విన్నవించింది.

పింఛను ఇచ్చి ఆదుకోండి



'కూలి పనులు చేసుకుంటూ బతికేవాడిని. గత దీపావళి పండుగ రోజు బాణసంచా పేలి రెండు కాళ్లు కోల్పోయాను. ఇంటికే పరిమితం కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛను ఇచ్చి ఆదుకోండి' అంటూ వెంకటగిరికి చెందిన శివ అధికారులను కోరాడు.

రూ.25వేలలోపు జీతగాళ్లకు 'తల్లికి వందనం' ఇవ్వండి

తల్లికి వందనం పథకం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులకూ వర్తింపజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, డీవైఎఫ్ఐ నేత సుమన్ వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో రూ.25వేలు కంటే తక్కువ జీతం పొందే ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తామని ప్రకటించారని, ఆ మేరకు అమలు చేయాలని కోరారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో ప్రభుత్వ భూములను కాపాడాలని సర్పంచ్ దామినేటి కేశవులు, గ్రామస్థులు కోరారు. పేరూరులో రూ.20 కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు కొందరు ప్రణాళిక వేసుకున్నారన్నారు. కాసింకాలువ గడ్డను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. చెరువు, కాలువ భూముల్లోనూ అక్రమ కట్టడాలు కట్టారన్నారు. వాటిపై దృష్టి సారించాలని కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

కాలువను కాపాడండి

స్వర్ణముఖి నది నుంచి తిరుపతి రూరల్ మండలంలోని పేరూరు చెరువుకు నీటిని తీసుకువచ్చే కాలువను కాపాడాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి జేసీ శుభం బన్సల్‌కు విన్నవించారు. సి.మల్లవరం జంక్షన్ నుంచి రేణిగుంట మండలం గాజులమండ్యం జంక్షన్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయని, ఇందులో భాగంగా కాలువలను సమూలంగా పూడ్చి వేస్తున్నారన్నారు. పేరూరు చెరువుకు నీరు రావడం వల్ల తిరుపతి రూరల్ మండలంలో సగానికిపైగా పంచాయతీలకు నీటి సమస్య తీరుతుందని వివరించారు. నేషనల్ హైవే అథారిటీ వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సన్నద్ధం

- భక్తుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఏర్పాట్లు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు సురక్షిత ప్రయాణం అందించడమే లక్ష్యంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన 11 డిపోల పరిధిలో తిరుమలకు నడుస్తున్న 430 బస్సుల మరమ్మతులు, రంగులు, లైటింగ్, సాంకేతికపరమైన అంశాల తనిఖీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డీపీటీవో వెంకటరావు ఆధ్వర్యంలో, డిప్యూటీ సీఎంఈ బాలాజీ పర్యవేక్షణలో రూ.కోటి వ్యయంతో ఐదు దశలలో బస్సులను ముస్తాబు చేస్తున్నారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆటోలకూ క్యూఆర్ కోడ్

- తిరుపతిలో డిజిటలైజేషన్ నెంబర్ల కేటాయింపు
- దశలవారీగా జిల్లా అంతటా అమలు
- ప్రయాణికుల భద్రతకు పోలీసుల చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొందరు ఆటోవాలాల ఆగడాలకు చెక్‌పెట్టేలా పోలీసులు క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మొదటి దశలో తిరుపతిలోని 200 ఆటోలను డిజిటలైజేషన్ చేశారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి ఆధ్వర్యంలో సోమవారం పోలీసు పరేడ్ గ్రౌండులో ఆటోల డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఆటోకు డ్రైవర్ వెనుక సీటులో ట్రాఫిక్ పోలీసులు తయారు చేసిన క్యూఆర్ కోడ్‌తో పాటు అందులో వున్న ఎనిమిది అంశాలతో కూడిన స్టిక్కర్‌ను అతికించారు. ఎవరైనా ఆటో డ్రైవర్లు తమతో దురుసుగా ప్రవర్తించినా, మద్యం తాగి నడిపినా, ఇతర విలువైన వస్తువులు ఆటోలో పోగొట్టుకున్నా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఇబ్బంది పెట్టినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపితే చాలు. వెంటనే ఆ ఆటో వివరాలు, ఎక్కడుందనేది కమాండ్ కంట్రోలు ద్వారా పోలీసులు గుర్తించి చర్యలు తీసుకుంటారు. నేరస్తులు ఆటోలో ప్రయాణించి దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే గుర్తించవచ్చని ఎస్పీ హర్షవర్దన రాజు చెప్పారు. ఈ క్యూఆర్ కోడ్‌లో ట్రాఫిక్ డీఎస్పీతో పాటు సీఐలు, పోలీసు స్టేషన్ నెంబర్లు పొందుపరిచారు. ఆటో యజమాని పేరు, అడ్రస్, ఫొటో, డ్రైవింగ్ లైసెన్సు నెంబరు, స్టాండు ఏరియా, మొబైల్ నెంబరు, ఆటో నెంబరు, అత్యవసరమైన ఫోన్ నెంబర్లు ఉంటాయి. ఆటోలో ఎక్కిన వెంటనే ప్రయాణికుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మొబైల్‌లో ఉంచుకోవాలి. తద్వారా అందులో పొందుపరచిన ప్రింట్, షేర్ ఆన్ వాట్సాప్, ట్రాక్ లొకేషన్, అత్యవసర కాల్ నెంబర్లు, పోలీసు స్టేషన్ వివరాలు, ఫిర్యాదు చేయాలంటే సమీపంలోని పోలీసు స్టేషన్ ఏది అనే వివరాలు అందులో ఉంటాయి.



ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ఎన్‌రోల్ చేసుకోవాలి

తిరుపతిలోని అన్ని ఆటోలకు తప్పనిసరిగా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన రాజు విజ్ఞప్తి చేశారు. క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశాక అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యాంసుందర్, రామకృష్ణమాచ్చారి, డీటీవో మురళీమోహన్, రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, సీఐలు సంజీవ్‌కుమార్, భాస్కర నాయక్, సుబ్బారెడ్డి, ఎస్ఐలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిలోని 20వేలకుపైగా ఉన్న ఆటోలన్నీ తప్పనిసరిగా డిజిటలైజేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుల్లెట్‌రమణ, కృష్ణయాదవ్, మధు, ప్రమోద్, రామచంద్ర, ఆటో అసోసియేషన్ అధ్యక్షులు ఖాజా, ఆటో డ్రైవర్లు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీ సమస్యలేవో చెప్పండి

- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులదారుల వద్దకొచ్చి అడిగిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుదారుల వద్దకే ఎస్పీ హర్షవర్ధనరాజు వచ్చారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. సాధారణంగా అర్జీదారులు సంబంధిత కౌంటర్లలోని సీఐల వద్దకు వెళ్లి అక్కడ వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి మళ్లీ అదనపు ఎస్పీల వద్దకు వెళ్లి అక్కడ నుంచి ఎస్పీ చాంబర్‌కు వెళ్లి తమ సమస్యలను చెప్పేవారు. దీనివల్ల ఎస్పీ వద్దకు వెళ్లేసరికి ఫిర్యాదుదారులలు కనీసం గంట పాటు వేచి ఉండాల్సి వచ్చేది. ఈ క్రమంలో సోమవారం పీజీఆర్ఎస్ సందర్భంగా ఫిర్యాదుదారుల వద్దకే ఎస్పీ వెళ్లారు. వారి పేర్లు, ఎక్కడ నుంచి.. ఏ సమస్యపైన వచ్చారు? ఎన్ని రోజులుగా వస్తున్నారు? గతంలో మీ సీఐ కానీ, ఎస్ఐకి కానీ కంప్లెయింట్ చేశారా? అని వివరాలు తెలుసుకున్నారు. సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 99 సమస్యలు రాగా.. దాదాపు 53 సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మిగిలిన సివిల్ తగాదాలు, ఆర్థిక లావాదేవాలు, కోర్టు కేసులు, భార్యాభర్తల తగాదాలు వంటి వాటికి తమ వద్ద పరిష్కారం వుండదని నేరుగా న్యాయ స్థానాలను ఆశ్రయించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎవరైనా అలక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్పీ పీఆర్ఓలు నాగరాజు, తిరుమల రావు, సిబ్బంది పాల్గొన్నారు.


వికలాంగురాలి వద్దకు వచ్చి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

- దివ్యాంగురాలు సుమతి ఇతర సహాయకుల ద్వారా వీల్‌చైర్‌లో ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఈమెను గమనించిన ఎస్పీ నేరుగా వెళ్లి పిటీషన్‌ను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో గాంధీ చిత్రపటానికి కేకులు తినిపిస్తూ అపహాస్యం చేస్తున్నారంటూ ఆమె ఫిర్యాదు చేయగా.. వెంటనే విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.
- మెడకు కండువా కప్పుకొని ఒక పక్కన నిలబడి ఉన్న తిరుపతి లింగేశ్వర నగర్‌కు చెందిన వెంకటనారాయణను ఎస్పీ పలకరించారు. 'సర్వే నెంబరు 147-1లో నేను చిన్న రేకుల షెడ్డు వేసుకుని జీవనం సాగిస్తున్నా. అదే ప్రాంతానికి చెందిన ప్రమోద్, చిట్టిబాబు వచ్చి ఆ స్థలం వారిదంటూ ఆక్రమించుకుని నన్ను అడ్డుకుంటున్నారు'అని ఎస్పీతో ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం విచారించి న్యాయం చేయాలని రూరల్ సీఐ చిన్నగోవిందును ఆదేశించారు.

అభ్యంతరాలపై నాలుగు వారాల్లో నివేదించండి

- వెటర్నరీ వర్సిటీ వీసీని కోరిన ఏజీ ఆడిట్ అధికారులు

తిరుపతిరూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలోని ఆడిట్‌కి సంబంధించిన అభ్యంతరాలపై నాలుగువారాల్లో నివేదించాలని వీసీ జేవీ రమణని అకౌంటెంట్ జనరల్ ఆడిట్ అధికారులు ఇటీవల రిప్లై కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్సిటీలని క్షుణంగా ఆడిట్ చేసి నివేదించాలని ఏజీ ఆడిట్ అధికారులను ఆదేశించారు. దీంతో వెటర్నరీ వర్సిటీ పరిధిలో 2024 జూలై 10 నుంచి 2025 మార్చి 26 వరకు నాలుగు దఫాలుగా ఆడిట్‌ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ, ఐసీఏఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్, ఐసీఏఆర్ డెవలప్‌మెంటల్ నిధులతో చేపట్టిన పనులకు వర్సిటీ ఏసీ ఆఫీసుకి బిల్లులు సెటిల్‌చేయకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా నిధులను ఖర్చుచేయడం, అగ్రిమెంట్ ప్రకారం సివిల్ పనులు సకాలంలో పూర్తిచేయకపోవడం, అదనంగా నిధులు కేటాయించడం, వైసీపీ హయాంలో ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన గోపాలకృష్ణ ద్వివేదికి బోర్డు అనుమతి లేకుండా మెడికల్ రీయింబర్స్ బిల్లులు క్లైంచేసి.. డ్రా చేయడం, అదే ప్రభుత్వంలో వర్సిటీ కౌన్సిల్‌కి ఒక అడ్వొకేట్‌ని మాత్రమే అపాయింట్ చేయగా.. అదనంగా మరో 5మంది అడ్వొకేట్లని ఎంగేజ్ చేయడం, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో (బ్యాక్‌లాగ్)లో నెట్ అర్హత లేనివారికి పోస్టింగులు, పదోన్నతులు ఇవ్వడం, దీనిలో 2013 నుంచి చేపట్టిన నియామకాల్లో 49మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకి నెట్ అర్హత లేకపోవడం, పదవీవిరమణ పొంది వయోపరిమితి 60-62 ద్వారా పనిచేసిన ఉద్యోగులకు రావాల్సిన జీత, భత్యాల కన్నా ఎక్కువగా డ్రా చేయడం, పాలకమండలి అనుమతిలేకుండానే నిధుల మంజూరు, వర్సిటీ డైరెక్ట్ రిసిప్ట్స్ నుంచి చెల్లించడం, ఎన్‌యూఎఫ్ ఎక్స్‌పెండేచర్, ఇద్దరు ఉద్యోగుల మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్, ఓ ఉద్యోగి పదోన్నతి, లీవ్ నాట్ డ్యూటీ కింద నిబంధనలకు విరుద్ధంగా సెలవుల మంజూరు , పెన్షన్ ప్రపోజల్ సాంక్షన్స్, నెట్ కంపెనీకి లేట్ చార్జీలు చెల్లింపు, ఆర్టీఐ రిజిస్టర్స్ ప్రాపర్‌గా మెయిన్‌టైన్స్ తదితర ఇరెగ్యులర్ అంశాలకి సంబంధించి స్పెషిఫిక్ రిమార్క్‌పై నాలుగువారాలలోపు నివేదించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


వెటర్నరీ వర్సిటీ పరిపాలనాభవనం



ఏనుగులు ధ్వంసం చేసిన వరినారు, విరిచేసిన మామిడి చెట్లు

ఏనుగుల దాడుల్లో పంటల ధ్వంసం



పలమనేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం ముసలిమడుగు గ్రామం వద్ద ఆదివారం అర్ధ రాత్రి అడవి నుంచి వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాలపై కి చేరుకుని ధ్వంసం చేశాయి. ముసలిమడుగు గ్రామానికి చెందిన రైతు ఉమా పతి నాయుడి మామిడి చెట్లను విరిచి మామిడి కాయలు తిని నేలరాల్చాయి. మహిళా రైతు గిరిజ కు చెందిన వరినారును తొక్కేశాయి. కొబ్బరిచెట్టును తొలగించాయి. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తుందని అటవీశాఖ అధికారులు రైతులకు హామీ ఇచ్చారు.

టమోటా రైతులకు తీరని కష్టాలు



జొండ్లవారిపల్లె వద్ద పారబోసిన టమోటా

రొంపిచెర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేపట్టిన టమోటాకు గిట్టుబాటు ధరల్లేక జాండీస్, ఊజీలు వంటి రోగాలు సోకి రైతులకు తీరని కష్టాలే మిగిలాయి. గత ఏడాది టమోటా పంట సాగుతో మంచి లాభాలు రావడంతో రైతులు అధికంగా సాగుచేశారు. ఎకరాకి రూ.లక్ష వ్యయంతో పంట సాగు చేపట్టినా ధరల్లేక కూలీలు, రవాణా బాడుగలకు రాకపోవడంతో పొలాల్లోనే కాయలు కోయకుండా వదిలేశారు. ప్రస్తుతం 10 కిలోల ధర రూ.150 నుంచి రూ.200 ధర పలుకుతోంది. అయితే కొన్ని చోట్ల కాయలకు పసుపురంగులో మచ్చలు రావడం (జాండీస్)తో రోడ్ల పక్కన పారబోస్తున్నారు. రైతులు సాగుచేసిన దోస, టమోటా, మామిడి పంటలకు ధరల్లేకపోవడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించాలి



క్యూలైన్లను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్

చౌడేపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా ఆలయ అధికారులు పనిచేయాలని దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. సోమవారం ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యాలు, ఏర్పాట్లపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఏకాంబరం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం దేవదాయశాఖ కమిషనర్ మాట్లాడుతూ అన్ని ఆలయాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించే విధంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆలయాల్లో క్యూలైన్లు పెంచాలని, శుభ్రంగా ఉంచాలని, ప్రసాదాలు నాణ్యతతో అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు బాబునాయుడు, రెడ్డెప్ప, దుర్గసముద్రం రమణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన అష్రఫ్

గంగవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గంగవరం మండలం పలమనేరు-బెంగళూరు రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం మేకలనాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అష్రఫ్ (36) తన ద్విచక్రవాహనంపై గోశాల ఎదురుగా వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొంది. ప్రమాదంలో అష్రఫ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గంగవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఆటో దొంగల అరెస్టు



పట్టుబడ్డ నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆటోలను చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాల్లో ఆటోలను చోరీచేసే ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10.50లక్షల విలువైన మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఒకటో పట్టణ సీఐ మహేశ్వర మీడియాకు తెలిపారు. కొన్ని రోజులుగా చిత్తూరు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట ఇంటి వద్ద ఉంచిన ఆటోలను చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. తమకు అందిన సమాచారంతో రెండో పట్టణ పోలీసులతో ఒకటో పట్టణ పోలీసులు కలిసి సోమవారం నగరంలోని కట్టమంచి వద్ద కొండల ఆదినారాయణను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా తిరుపతికి చెందిన చిన్నంగారి రమణతో కలిసి ఆటోలను దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపాడు. వెంటనే ఓ బృందం తిరుపతి కెళ్లి జీవకోనలో ఉన్న చిన్నంగారి రమణతో అరెస్టు చేసి చిత్తూరుకు తీసుకొచ్చారు. వారి వద్ద నుంచి రూ.10.50లక్షల విలువైన మూడు ఆటోలు, విడిభాగాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



సురేష్ (ఫైల్ ఫొటో)

నింద్ర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నింద్ర మండలం కావనూరు పంచాయితీ గాండ్ల కండ్రిగకు చెందిన ఎ.సురేష్ (31) తనకున్న పొలంలో వంకాయ, వేరుశనగ సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. సాగు కోసం గతంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద, తన తల్లి పేరిట డ్వాక్రా సంఘంలో రుణాలు తీసుకున్నాడు. ఆశించిన దిగుబడిరాక నష్టాలు రావడంతో చేసిన అప్పులు తీర్చలేక ఈనెల మూడో తేదీన ఇంటివద్ద పురుగుల మందు తాగేశాడు. గమనించిన కుటుంబీకులు తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆశతో వచ్చాం.. ఆసరాగా నిలవండి

అధికారులకు బాధితుల వినతి - కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కు 254 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశతో వచ్చాం.. ఆసరాగా నిలవండి అని బాధితులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అధికారులకు అర్జీలను సమర్పించారు. మొత్తం 254 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూశాఖకు 187, పోలీసుశాఖకు 13, డీఆర్‌డీఏకు 29, విద్యాశాఖకు 8, మున్సిపాలిటీలకు 3, ఉద్యానశాఖ, డీసీసీబ్యాంకు, జిల్లా రిజిస్ట్రార్, డీఎస్వో, రూరల్ వాటర్ సప్లయిస్, ఇరిగేషన్, ఏపీఐఐసీ, హౌసింగ్ తదితర శాఖలకు 14 అర్జీల చొప్పున ఉన్నాయి. బాధితుల నుంచి అర్జీలను ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, వివిధశాఖల జిల్లా అధికారులు స్వీకరించారు. ప్రధాన అర్జీలిలా ఉన్నాయి.

అంగన్వాడీ సిబ్బందికి సంక్షేమ పథకాలివ్వండి

అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని వర్తింపు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ముందు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ల సంఘ నేతలు ధర్నా చేశారు. నేతలు షకీల, సుజనీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖకు 44 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 44 అర్జీలు వచ్చాయి. బాధితుల నుంచి అర్జీలను ఎస్పీ మణికంఠ తీసుకున్నారు. వచ్చిన అర్జీల్లో.. సైబర్ క్రైమ్‌పై ఒకటి, వేధింపులపై 2, కుటుంబ తగాదాలపై 6, ఇంటి తగాదాలపై 3, భర్త వేధింపులపై ఒకటి, భూ తగాదాలపై 14, ప్రేమవివాహాలపై 2, డబ్బు తగాదాలపై 12, దారి సమస్యపై ఒకటి, ఆస్తి తగాదాలపై రెండు చొప్పున ఉన్నాయి.

'అదానీ' మీటర్లను ఇళ్లకు అమర్చవద్దు



అదానీ స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఇళ్లకు అమర్చవద్దని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మీటర్లను అమర్చాక బిల్లులు అధికంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు చైతన్య, మునస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలి



వెదురుకుప్పం మండలం యనమలమంద వాసులు

తమ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని వెదురుకుప్పం మండలం యనమలమందవాసులు డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ పేరుతో విద్యార్థులను ఆళ్లమడుగు పాఠశాలకు మార్చడం వల్ల దూరం పెరుగుతుందన్నారు. పైగా విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోయారు. ● గంగాధరనెల్లూరు మండలం అగ్రహారంలోనూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. ఇక్కడి విద్యార్థులను రెండు కిలోమీటర్ల దూరంలోని కొత్త వెంకటాపురంలో ఉన్న పాఠశాలకు వెళ్లమని చెబుతున్నారన్నారు. పాత బడినే కొనసాగించాలని కోరారు. ● కొత్తూరు ఏఏడబ్ల్యూ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కూడా కొనసాగించాలని కోరారు. విద్యార్థులను రెండు కిలోమీటర్లకు పైగా ఉన్న నెల్లేపల్లెకు వెళ్లాలని అధికారులు చెప్పడం సరికాదన్నారు.





జీడీ నెల్లూరు మండలం కొత్తూరు ఏఏడబ్ల్యూవో కాలనీవాసులు, అగ్రహారం గ్రామస్తులు

శిశు మరణాలు లేని సమాజం నిర్మిద్దాం

● ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శిశుమరణాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తరఫున 'స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఇన్‌చార్జి కలెక్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలందరినీ ఇంటింటి సర్వే ద్వారా ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు గుర్తించి, వారి జాబితాను తయారుచేయాలన్నారు. సోమవారం నుంచి ఈనెల 31వ తేదీవరకు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. డీఎంహెచ్‌వో సుధారాణి, నోడల్ ఆఫీసర్ హనుమంతరావు, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

దుబాయ్ నుంచి సురక్షితంగా స్వస్థలానికి..!

ఎమ్మెల్యే జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన యువకుడు



దిలీప్ వివరాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చొరవతో.. దుబాయ్ నుంచి ఓ యువకుడు సురక్షితంగా స్వస్థలానికి చేరాడు. చిత్తూరు సమీపంలోని చెర్లోపల్లెకు చెందిన దిలీప్ కొన్ని నెలల కిందట మెకానిక్ ఉద్యోగం ఇప్పిస్తామన్న బ్రోకర్ల మాటలు విని దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడికెళ్లాక వెట్టిచాకిరీ చేయిస్తూ, సరైన భోజనం పెట్టక పోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాడు. ఈ క్రమంలో తనను కాపాడాలని టీడీపీ నాయకుల ద్వారా చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌ను కోరాడు. ఎమ్మెల్యే స్పందించి.. దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీతో మాట్లాడి దిలీప్‌ను సురక్షితంగా ఇండియాకు రప్పించారు. సోమవారం చిత్తూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జగన్మోహన్‌ను దిలీప్ తన కుటుంబీకులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.

'తల్లికి వందనం'పై విషం కక్కుతున్న వైసీపీ

చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్



మీడియాతో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం'పై వైసీపీ విషం కక్కుతోందని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ మండిపడ్డారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి పథకం వర్తింపజేస్తుంటే కడుపు మంటతో వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. రూ.2వేలు లోకేశ్ జేబులోకి పోయాయంటూ దిగజారుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసీపీ పాలనలోనూ రూ.13వేలను ఇచ్చారని అంటే అప్పుడు రూ.2వేలు జగన్ జేబులోకి వెళ్లాయా.. తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లాయా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో కేవలం 42లక్షల మందికి మాత్రమే ఇస్తే.. ప్రస్తుత ప్రభుత్వం 67.27లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తోందని తెలిపారు. ఇక విద్యార్థులకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పులోనూ కమీషన్లు తీసుకున్న నీచ చరిత్ర వైసీపీదని ఆరోపించారు. వైసీపీ కుట్రలను ప్రజలు నమ్మరన్నారు. నేతలు మోహన్‌రాజ్, అమర నాథనాయుడు, విజయ్ కుమార్, దేవ, రఘు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవ భరోసా సభకు తరలిరండి



మీడియాతో మాట్లాడుతున్న పరసా రత్నం తదితరులు

బంగారుపాళ్యం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 22వ తేదీన జరగనున్న బీసీల ఆత్మగౌరవ భరోసా సభకు తరలిరావాలని అంబేడ్కర్ - పూలే ఫౌండేషన్ అధ్యక్షుడు, మాజీమంత్రి డాక్టర్ పరసా రత్నం పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక బీసీ సంక్షేమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘంతో కలిసి ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని బీసీమంత్రులు హాజరవుతారని తెలిపారు బీసీలు, ఎస్సీలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు ఆల్మన్ రాజ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజుగౌడ్, జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ఏపీఎఫ్ కన్వీనర్ రఘునాథ్ సింగ్, జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, బీసీ నాయకుడు నీరజాక్షులు గౌడ్, మురళి, ఎస్సీ సెల్ టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించండి

● సౌత్ కోస్ట్ రైల్వే జీఎం సందీప్ మాథుర్



తిరుపతి రైల్వేస్టేషన్‌లో జీఎం సందీప్ మాథుర్ తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జూన్16 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టు పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలని సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజరు సందీప్ మాథుర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఎయిర్ కాన్‌కోర్సునిర్మాణాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయాలు, ప్రయాణికులకు కలిగే అసౌకర్యాల గురించి తెలుసుకున్నారు. నిర్మాణాల సమయంలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాల గురించి అడిగారు. ఇక, రైల్వే స్టేషన్ అభివృద్ధి, తిరుపతి-చెన్నై బైపాస్ మార్గం పనులు, రేణిగుంటలో రూ.25 కోట్లతో జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. పూడి-ఏర్పేడు బైపాస్ లైన్ ప్రాజెక్టు ఏదశలో ఉందని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైలు మార్గం పనులు ఏ దశలో.. ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. ఇలా రెండున్నర గంటల పాటు అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం సీఈ సూర్యనారాయణ, ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ విభాగాల అధికారులు వామనమూర్తి, డాక్టర్ శ్రావణకుమార్, మణికుమార్, సాయివిజయ్ కుమార్, మణికంఠ, సుదర్శన్, రమేష్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనరు రాజగోపాల్ రెడ్డి, సుంకన్న, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, మాధవరావు, రాంబాబు, ఎం.సందీప్ కుమార్ పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం: సౌత్ కోస్ట్ రైల్వే జీఎంగా తొలిసారిగా తిరుపతికి వచ్చిన సందీప్ మాథుర్‌ను మజ్దూర్ యూనియన్ నాయకులు సురేష్ కుమార్, రవీంద్ర నాయక్ సన్మానించారు. నాయకులు శ్రీనివాసులు, రాజేష్, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం.. ఆనందం



కుప్పం పబ్లిక్ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడంతో ఆరోగ్యం, ఆనందం సమకూరుతుందని బీసీఎన్ విద్యాసంస్థల అనుబంధమైన కుప్పం పబ్లిక్ స్కూల్ అండ్ కుప్పం జూనియర్ కళాశాల చైర్‌పర్సన్ శాంతానాగరాజ్ అన్నారు. ఈ రెండు విద్యా సంస్థల్లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యోగాంధ్ర సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి యోగాసనాలు వేసి సాధన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శాంతానాగరాజ్ మాట్లాడుతూ యోగా సాధనతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మేధో శక్తి వృద్ధి అవుతుందని చెప్పారు. తద్వారా విద్యలో, వృత్తిలో ఒత్తిళ్లను అధిగమించి విజయం సాధించగలమన్నారు. కార్యక్రమంలో కుప్పం పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.దమయంతి, కుప్పం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంబీ.సుప్రియ, టీడీపీ నాయకులు సత్యేంద్ర శేఖర్, సుబ్రహ్మణ్యం, వేలు, రవి, ఇర్ఫాన్ నబి, ప్రభుత్వ పరిశీలకులు మోహన్ కుమార్, సుష్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి మున్సిపల్ కార్యాలయం



నూతన మున్సిపల్ కార్యాలయ భవనం

కుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాక సంఘ కార్యాలయాన్ని సోమవారం నూతన భవనంలోకి మార్పు చేశారు. కుప్పం మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో ప్యాలెస్ రోడ్డులోని పాత భవనంలో కార్యాలయం కొనసాగేది. కుప్పం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యాక ఇదే భవనంలో కొద్దికాలం కొనసాగింది. అయితే నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం కోసం పాత భవనాన్ని కూలగొట్టారు. ఈ సమయంలో మున్సిపల్ కార్యాలయాన్ని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పాత ద్రావిడ విశ్వ విద్యాలయం క్యాంపస్ భవనంలోకి మార్చారు. నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం గత నెలలో పూర్తయింది. దీంతో ద్రావిడ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఉన్న మున్సిపల్ కార్యాలయాన్ని సోమవారం నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనంలోకి మార్చారు. అయితే పాత కార్యాలయ భవనంలోని వస్తువులు, రికార్డులు, ఫర్నిచర్ అన్నీ ఇంకా అక్కడే ఉండిపోయాయి. దీంతో సోమవారం ఉదయం నుంచి వీటన్నింటి తరలింపు ప్రారంభమైంది. మున్సిపల్ సిబ్బంది మొత్తం ఇదే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు వాస్తు ప్రకారం తమకు ఏ గదైతే ఛాంబర్‌గా వినియోగించుకోవడానికి బాగుంటుందోనన్న శోధన చేస్తూ కనిపించారు. పాత భవనమైనా, నూతన భవనమైనా ఎవరూ వాస్తును మాత్రం మరచిపోరనడానికి ఈ శోధన నిదర్శనం.

పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

చౌడేపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని.. ఈగలు, దోమలు వాలిన ఆహారం, కలుషిత ఆహారం, నీరు తీసుకోవడంతో అతిసార బారిన పడే అవకాశాలు ఉంటాయని డాక్టర్ పవన్‌కుమార్ అన్నారు. సోమవారం అతిసారపై చౌడేపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 19న స్థానిక పీహెచ్‌సీలో చెన్నై ఎంఎన్ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● **బైరెడ్డిపల్లె:** మండలంలోని తీర్థం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బంది సోమవారం అతిసార వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎల్‌టీ హరిశ్రీ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రాజారెడ్డి, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి అందిస్తున్న నాయకులు

రామకుప్పం జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం భగళనత్తంలలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, హరీష్, నేతలు మనోహర్, రాజేంద్ర, పవన్, గోవిందన్, మునిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రిపై దాడి కేసులో కుమారుడి అరెస్టు



మనోహర్ అరెస్టు చూపుతున్న ఎస్ఐ నాగేశ్వరరావు

చౌడేపల్లె, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): తండ్రిపై దాడి చేసిన కేసులో కొడుకు మనోహర్‌ను ఎస్ఐ నాగేశ్వరరావు తన సిబ్బందితో సోమవారం అరెస్టు చేశారు. మండలంలోని ఏ కొత్తకోటకు చెందిన చిన్నపరెడ్డిపై అతడి కుమారుడు మనోహర్ గత మార్చి 31న దాడి చేశాడు. కన్న కొడుకు దాడిలో తీవ్రంగా గాయపడ్డ చిన్నపరెడ్డి చికిత్స పొందుతూ ఏప్రిల్ 9న ఇంటికి చేరుకుని తీవ్ర మనస్తాపంతో ఏప్రిల్ 21న మృతిచెందాడు. భార్య సరస్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మనోహర్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపారు.

కక్షతో అక్రమ కేసులు: వైసీపీ

పుంగనూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి వైసీపీ నాయకులపై కక్షతో అక్రమ కేసులపై దృష్టి సారించిందని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఆరోపించారు. సోమవారం పుంగనూరులో జగనన్న నమ్మకం- చంద్రబాబు మోసం అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏడాది పాలనలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెడుతున్నారని, రాష్ట్ర అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, నాయకులు అమరనాథరెడ్డి, రాగానిపల్లె బాబురెడ్డి, షరీఫ్, నయాజ్, ప్రభాకర్‌నాయక్, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** ప్రభుత్వ వైఫల్యాలపై వైసీపీ ముద్రించిన పుస్తకాన్ని పలమనేరులో సోమవారం వైసీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల దినంలో వచ్చే అర్జీలకు అధికారులు తక్షణ పరిష్కారం చూపాలని ఆర్డీవో భవాని సూచించారు. సోమవారం పలమనేరులోని తన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో పలువురు తమ సమస్యలపై అర్జీలు అందించారు. భూసమస్యలు, సర్వేలో పొరపాట్లు, పట్టాదారు పాసు పుస్తకాలు, భూవివాదాలపై అర్జీలను ప్రజలు ఆర్డీవోకు అందజేశారు. వీటిలో కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కారం కోసం సంబంధిత తహసీల్దార్లతో ఆర్డీవో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

20న శిథిల భవనాల తొలగింపునకు వేలం

బైరెడ్డిపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శిథిలమైన రెండు వసతిగృహ భవనాలను తొలగించడానికి ఈనెల 20న ఉదయం 11 గంటలకు పాఠశాల ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శోభ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.10 వేలు ధరావతు, రూ.3 వేలు ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. 'ది ప్రిన్సిపాల్, ఏపీఆర్ స్కూల్, కమ్మనపల్లె ' పేరుపై డీడీ తీసి 19వ తేదీ లోపు పాఠశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నంబరు 8712625057 లో సంప్రదించాలని కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సురేష్‌రెడ్డి



చౌడేపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సురేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటానని, ఎక్కడైనా తాగునీటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రానికి టీవీ విరాళం



అంగన్వాడీ కేంద్రానికి టీవీ అందిస్తున్న ఎంఎల్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ కంపెనీ ప్రతినిధి ప్రదీప్‌రాజు

చౌడేపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో విద్యార్థులకు విద్యాసామగ్రి, మేకలచిన్నేపల్లె అంగన్‌వాడీ కేంద్రానికి టీవి విరాళంగా అందించినట్లు మేకలచిన్నేపల్లె హైస్కూల్ హెచ్ఎం చంద్ర పేర్కొన్నారు. సోమవారం శెట్టిపేట పంచాయతీకి చెందిన, ఎంఎల్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ కంపెనీ అధినేత మాదిరాజు లక్ష్మణరాజు సహకారంతో ఆ కంపెనీ ప్రతినిధి సాగిరాజు ప్రదీప్‌రాజు శెట్టిపేట హైస్కూల్, ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, పందిళ్ళపల్లె పంచాయతీలోని పందిళ్ళపల్లె ఎంపీపీ స్కూల్, చుక్కువారిపల్లె ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, సుధాకర్, ప్రవీణ్‌కుమార్, రాఘవేంద్రరాజు, కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలి



ఫజులూపేటలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీవైఈవో ఇందిర

రొంపిచెర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బడి ఈడుపిల్లలందరూ బడిలోనే ఉండేలా చూడాలని డీవైఈవో ఇందిర అన్నారు. సోమవారం ఆమె మండలంలోని ఫజులూపేట పాఠశాలనను సందర్శించి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం కింద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** మండలంలోని శెట్టిపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్ర గుప్తా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



పెద్దబరిణేపల్లె పాఠశాలలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తల్లిదండ్రులు, నాయకులు

వి.కోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో అర్హులైన పిల్లల తల్లుల ఖాతాలకు నగదు జమచేయడంపై ఆనందం వ్యక్తం చేస్తూ సోమవారం వి.కోట మండలం పెద్దబరిణేపల్లె ప్రాథమిక పాఠశాలలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలోని పిల్లలు ఎంతమంది అందరికీ పథకాన్ని వర్తింపజేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, నాయకులు రాంబాబు, విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో సమస్యలు పదిలం

● అవస్థలు పడుతున్న రైతులు ● పట్టించుకోని అధికారులు, నాయకులు



పలమనేరు మార్కెట్‌యార్డులో మండీల వెనుక వైపు ఉన్న మరుగుదొడ్లు



పలమనేరు మార్కెట్‌యార్డులో పార్కింగ్‌కు వేసిన కంచె

పలమనేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ యార్డులో పలు సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డుకు మూడు వైపులా దారులున్నాయి. అయితే ఇందులో తూర్పువైపు ఉన్న దారి గేటు ఎప్పుడూ మూసే ఉంటుంది. మిగిలిన రెండు దారుల్లో రైతులు పండించిన కూరగాయలను మార్కెట్‌లోకి తీసుకొచ్చే వాహనాలతో పాటు మార్కెట్ యార్డులో మండీల నుంచి కొనుగోలు చేసిన కూరగాయలను ఇతర ప్రాంతాలకు తరలించే వాహనాలు వస్తున్నాయి. దీంతో తరచూ ట్రాఫిక్ ఎదురవుతోంది. అధికారులు ఉత్తరం వైపున ఉన్న రెండు గేట్లు రైతులు కూరగాయలను తీసుకొచ్చేందుకు, తూర్పున ఉన్న గేటు ద్వారా మాత్రమే కూరగాయలను ఇతర ప్రాంతాలకు తరలించే వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. అంతేకాక వేల సంఖ్యలో రైతులు, వ్యాపారులు ఇక్కడికి వస్తున్నారు. వీరికి మరుగుదొడ్ల సౌకర్యం సక్రమంగా లేదు. ఉన్న మరుగుదొడ్డి మండీల మరుగున పడిపోయింది. ద్విచక్రవాహనాలు నిలిపేందుకు ఏర్పాటు చేసిన షెల్టర్ లోపలకు వెళ్లకుండా ఆరేళ్ల క్రితం ఏర్పాటుచేసిన కంచెను తొలగించాలని రైతులు కోరుతున్నారు. అలాగే మార్కెట్ యార్డులోకి ప్రైవేటు వ్యక్తులు మురుగునీటిని మళ్లిస్తున్నారు. వీటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన



పలమనేరులో నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు



పుంగనూరు: మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనలో కాంట్రాక్టు ఇంజనీరింగ్ కార్మికులు

పలమనేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలమనేరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం పలువురు అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు ధర్నా చేపట్టారు. టెక్నికల్ ఉద్యోగుల జీతం నెలకు రూ. 29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు జీతం నెలకు రూ.24,500 ఇవ్వాలని, ఇప్పుడిస్తున్న జీతానికి రూ.6 వేలు పెంచి పారిశుధ్య కార్మికులకు, డ్రైవర్లకు, డ్రైనేజీ కార్మికులకు ఇవ్వాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మినిమమ్ టైమ్‌స్కేల్ వర్తింపజేయాలని, సీనియారిటీ ప్రామాణికంగా జీతాలివ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.మహేష్‌బాబు, శ్రీనివాసులు, రాజేష్‌బాబు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు శ్రీరాములు, కుమార్, సుదర్శన్‌రాజు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపజేయాలి



పలమనేరులో ధర్నా చేస్తున్న కార్యకర్తలు



పుంగనూరులో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

పలమనేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ వర్కర్లందరికీ వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి డిమాండు చేశారు. సోమవారం పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఒంటరి మహిళలు, వితంతువులు, గ్యాస్ సబ్సిడీ, తల్లికి వందనం, రేషన్‌కార్డుల్లో మార్పులు వంటివి పొందలేక అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం వారు సూపర్‌వైజర్ మాధవీలతకు వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు లక్ష్మి, సుమ, అనుపమ, సరస్వతి, ఫరీదా, శుభావతి, కళావతి, పద్మ, మీనాక్షి, మంజు భార్గవి, ఉమ, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక గ్రామ సచివాలయం ఎదుట నిరసన తెలిపారు.

● **పుంగనూరు రూరల్:** మండలంలోని రాంపల్లె వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రేమకుమారి, విజయ్‌కుమారి, మీనాకుమారి, లలిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను యథావిధిగా నడిపించాలి



బోడేవారిపల్లె పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు



నల్లగుట్టపల్లెతాండాలో నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

పుంగనూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గతంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని పిల్లల తల్లిదండ్రులు డిమాండు చేశారు. సోమవారం పుంగనూరు మండలం బోడేవారిపల్లె పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ బోడేవారిపల్లె నుంచి ఈడిగపల్లెకు పిల్లలు నడవలేరని, దాదాపు 2 కిలో మీటర్ల దూరం ఉందని వాపోయారు. అలాగే నల్లగుట్టపల్లె తాండాలో పిల్లల తల్లిదండ్రులు పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు మాజీ సర్పంచ్ దేశానాయక్, బాబునాయక్, నాగరాజనాయక్, మునీంద్రనాయక్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

పాత కక్షలతో మహిళపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాళ్యంపల్లె పంచాయతీ పెద్దగడిదేశికి చెందిన మునిరాజ భార్య లక్ష్మీదేవి (60) ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన రమేష్, మునిరెడ్డి పాత కక్షలతో ఆమెపై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముగిసిన మహాభారత యజ్ఞం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

సోమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భారతం మిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా సోమవారం ధర్మరాజు పట్టాభిషేకం ఘట్టంతో మహాభారత యజ్ఞం ముగిసింది. ఈ నేపథ్యంలో ఆలయ ఆవరణలో పంచపాండవ ఆలయంలో పురోహితులు హోమాలు చేశారు. ఉభయదారులు రాజన్న, అశోక్, సింహాద్రి, వెంకటప్ప, శ్రీకాంత్, బాబు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమంలో పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మహాభారత నిర్వాహకులు భాగవతారణి నాగరత్న, నాటక మండలి సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఉభయదారులను, పలువురు దాతలను అభినందించి జ్ఞాపికలు పంపిణీ చేశారు.

బీజేపీతోనే దేశంలో అభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నేతలు

వి.కోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్ అన్నారు. సోమవారం వి.కోట పట్టణంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో ప్రధానిగా మోదీ 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటేందుకు ముందుకురావాలన్నారు. కేంద్రం పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి బంగారురెడ్డి, నేతలు హేమంత్‌కుమార్, కవిత, ప్రమీళమ్మ, శోభ, అమర్‌నాథ్‌రెడ్డి, నవీన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్'కు 8 అర్జీలు

చిత్తూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కమిషనర్ నరసింహ ప్రసాద్ అర్జీలను స్వీకరించారు. మొత్తం ఎనిమిది అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. ఇంజనీరింగ్‌కు 3, రెవెన్యూకు 2, ప్రధాన కార్యాలయానికి 2, పింఛను ఒకటి చొప్పున ఉన్నాయి. ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివ, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు.

● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

● ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకత వల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

పాలసముద్రం/గంగాధరనెల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం, గంగాధరనెల్లూరు ఎంపీడీవోలుగా ఎస్.సతీష్, కృష్ణమహేష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలసముద్రంలోని కృష్ణమహేష్‌రెడ్డిని జీడీ నెల్లూరుకు అక్కడినుంచి సతీష్‌ను పాలసముద్రానికి బదిలీ చేశారు. వీరిని ఆయా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది అభినందించారు. కాగా, పాలసముద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉండిన మల్లేశ్వరి జడ్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. తిరుపతి పీఆర్ కార్యాలయంలో పనిచేసే ఎల్.కృష్ణ పాలసముద్రానికి వచ్చారు.

సదుం తహసీల్దారుగా ప్రమీల



సదుం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సదుం నూతన తహసీల్దారుగా ప్రమీల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొద్దిరోజులపాటు పనిచేసిన జయప్రకాశ్ బదిలీపై వెళ్లారు. కడప కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ప్రమీల సదుం తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితోపాటు మండల టీడీపీ నాయకులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, జగన్, చంద్ర పాల్గొన్నారు.

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద తదితరులు

చిత్తూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ కోసం పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జగన్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం తన కార్యాలయంలో సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 40శాతం సబ్సిడీతో సోలార్ ప్యానళ్లను ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించడంలో భాగంగా ఇటీవల ఈ-ఆటోలు, ఈ-స్కూటర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం సూర్యఘర్ పథకానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



సతీష్ - కృష్ణమహేష్‌రెడ్డి

పాలసముద్రం/గంగాధర నెల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం, గంగాధరనెల్లూరు ఎంపీడీవోలుగా ఎస్.సతీష్, కృష్ణమహేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలసముద్రంలోని కృష్ణమహేష్‌రెడ్డిని జీడీ నెల్లూరుకు అక్కడినుంచి సతీష్‌ను పాలసముద్రానికి బదిలీ చేశారు. వీరిని ఆయా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది అభినందించారు. కాగా, పాలసముద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉండిన మల్లేశ్వరి జడ్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. తిరుపతి పీఆర్ కార్యాలయంలో పనిచేసే ఎల్.కృష్ణ పాలసముద్రానికి వచ్చారు.

పలువురు కార్యదర్శుల బదిలీ

పెనుమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖలో పంచాయతీలకు గ్రేడ్లను కేటాయించి ఆ ప్రకారమే కార్యదర్శులు ఉండాలని కమిషనర్ జీవో జారీ చేశారు. ఇందులో భాగంగా పెనుమూరు మండలంలో పలువురు బదిలీ అయ్యారు. చింతపెంటలోని నాగభూషణమ్మ వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లెకి, ఆమె స్థానానికి కార్వేటినగరం నుంచి హబీబ్(గ్రేడ్4) బాధ్యతలు చేపట్టారు. సామిరెడ్డిపల్లెలోని మనోరంజని పులికల్లుకు వెళ్లగా, ఆమె స్థానానికి గంగాధరనెల్లూరు మండలం నుంచి దుర్గాప్రసాద్ (గ్రేడ్2) బాధ్యతలు చేపట్టారు. పులికల్లులోని శ్రీలత చిత్తూరుకు బదిలీ అవగా, ఆమె స్థానంలో మనోరంజని (గ్రేడ్3) బాధ్యతలు చేపట్టారు. కేసీపల్లెలోని నిర్మలాదేవి ఐరాల మండలానికి వెళ్లగా, ఆమె స్థానంలో వెదురుకుప్పం మండలం నుంచి ప్రసన్నకుమార్ (గ్రేడ్1) బాధ్యతలు చేపట్టారు. గుంటిపల్లెలోని నిర్మల పూతలపట్టు మండలం వేపనపల్లెకు బదిలీ కాగా, ఆమె స్థానంలో జీడీనెల్లూరు మండలం తూగుండ్రం నుంచి మురళి బాధ్యతలు చేపట్టారు. కలవగుంటలో పనిచేస్తున్న శేషుకుమార్ బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లెకు వెళ్లగా, ఆయన స్థానంలో పూతలపట్టు మండలం తలపులనేనివారిపల్లె నుంచి ఖాదర్‌వల్లి (గ్రేడ్1) నియమితులయ్యారు.

తమిళనాడుకు గ్రావెల్ అక్రమ తరలింపుపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బాలకృష్ణాపురం పంచాయతీ అలిమేలుమంగాపురంలోని కొండల నుంచి నెల రోజులుగా తమిళనాడు వ్యాపారులు గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని తహసీల్దార్ అరుణకుమారికి సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రోజుకు వంద లోడ్లు కంటే ఎక్కువగా తరలిస్తున్నారని తెలియజేశారు. 30 అడుగుల లోతు వరకు లోడేయడంతో వర్షం కురిసినపుడు కొండప్రాంతాల నుంచి నీరు చెరువులకు వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. పెద్దపెద్ద గోతుల కారణంగా పశువులను మేపడానికీ వీలు కాదన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పీఏసీఎస్‌లకు పాలకమండళ్ల నియామకం జరిగేనా?

నగరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్‌ల)కు పాలక మండళ్ల నియామకం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. పర్సన్ ఇన్‌చార్జిల ద్వారానే సహకార సంఘాల పాలన జరుగుతోంది. పాలక మండళ్ల నియామకం కోసం కసరత్తు చేసి ఎనిమిది నెలలకుపైగా కావస్తున్నా ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పర్సన్ ఇన్‌చార్జిల పాలన వల్ల వారు ఎప్పుడు వస్తారో తెలియడం లేదని రైతులు అంటున్నారు. అదే పాలకమండలి ఏర్పాటైతే స్థానికులు తమకు అందుబాటులో ఉంటారని చెబుతున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

'పీజీఆర్ఎస్'కు 8 అర్జీలు



బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కమిషనర్ నరసింహప్రసాద్ అర్జీలను స్వీకరించారు. మొత్తం ఎనిమిది అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. ఇంజనీరింగ్‌కు 3, రెవెన్యూకు 2, ప్రధాన కార్యాలయానికి 2, పించను ఒకటి చొప్పున ఉన్నాయి. ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్వారీలకు అనుమతులిచ్చే ముందు గ్రామసభ పెట్టండి: సీపీఐ

నగరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): క్వారీలకు అనుమతులిచ్చే ముందు గ్రామసభలు విధిగా నిర్వహించాలని నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి మండల పరిధిలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ క్వారీలపై బుధవారం నగరి తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో స్థానిక గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



చిత్తూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. చిత్తూరు రూరల్ మండలంలోని పెయినపల్లె రైల్వేట్రాక్ పక్కన సోమవారం ఉదయం 35-40 ఏళ్ల మధ్య ఉన్న ఓ యువకుడిని రైలు ఢీకొంది. గమనించిన కీమ్యాన్ 108కు సమాచారం ఇచ్చి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే 94942 28854, 94406 27652 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రహదారిని బాగు చేయండి



కట్టకిందవూరు వద్ద గోతిలో వర్షపు నీరు నిలిచి అధ్వానంగా ఉన్న రహదారి

యాదమరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యాదమరి నుంచి కేజీ సత్రానికి వెళ్లే మార్గంలో కట్టకిందవూరు వద్ద రోడ్డుపై భారీ గోతి ఏర్పడింది. ఇందులో వర్షపునీరు నిలిచి బురదతో నిండిపోయింది. దీనివల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఈ రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మామిడి రైతులను ఇబ్బంది పెట్టొద్దు: టీడీపీ

గుడిపాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడి రైతులను గుజ్జు ఫ్యాక్టరీల యజమానులు ఇబ్బంది పెట్టొద్దని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, తెలుగు యువత అధ్యక్షుడు శంకర్‌చౌదరి కోరారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. మామిడి రైతులకు టోకెన్ల విషయంలో ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. ఇచ్చిన తేదీల ప్రకారం కాయలను అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మండలంలోని ఫుడ్ అండ్‌ఇన్స్, తాజా మ్యాంగో ఫ్యాక్టరీ యజమానులు సహకరించాలన్నారు.

పెనుమూరులో పెరుగుతున్న డెంగ్యూ కేసులు

పెనుమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెనుమూరు మండలంలో డెంగ్యూ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే మూడు కేసులు నమోదయ్యాయి. మొదట పులికల్లు పంచాయతీ ఎలుంగుడ్లపల్లెలో ఆ తర్వాత కలవగుంట పంచాయతీ సన్యాసిపల్లెలో.. సోమవారం చార్వాగానిపల్లె పంచాయతీ దాసరపల్లెలో ఓ యువకుడికి డెంగ్యూ నిర్ధారణ అయ్యింది. ఇతడిని పెనుమూరు సీహెచ్‌సీలో అడ్మిట్ చేసి.. చికిత్స అందిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





● గతంలో.. ఉగ్రాణంపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద.. ప్రస్తుతం ●

బాగుపడ్డ పెనుమూరు - చిత్తూరు రోడ్డు / ఇది మంచి ప్రభుత్వం అంటూ స్థానికుల సంతోషం

పెనుమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి చిత్తూరు రోడ్డు బాగుపడింది. ధ్వంసమైన ఈ రహదారిని బాగు చేయాలని వైసీపీ హయాంలో స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. తరచూ ప్రమాదాలు జరిగేవి. కొందరు ప్రాణాలు కోల్పోగా, చాలామంది గాయపడ్డారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈనేపథ్యంలో ఈ రోడ్డును కూడా బాగు చేయడంతో ఇది మంచి ప్రభుత్వం అంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





● గతంలో.. శాతంబాకం గంగుపల్లె చెరువు వద్ద.. ప్రస్తుతం ●





● గతంలో.. రేణుకానగర్ కల్వర్టు వద్ద.. ప్రస్తుతం ●

థామస్‌పై దుష్ప్రచారం తగదు: తెలుగు యువత



పాతగుంటలో మాట్లాడుతున్న చంద్రబాబురెడ్డి

వెదురుకుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్‌పై దుష్ప్రచారం చేయడం తగదని తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు చంద్రబాబురెడ్డి అన్నారు. సోమవారం పాతగుంటలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ జెండా ఎగురవేయడానికి అధినేత చంద్రబాబు అన్వేషించి.. థామస్‌ని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పంపించారన్నారు. ఎన్నడూ ఈ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలువలేదన్నారు. థామస్ గెలిచి సత్తా చాటారన్నారు. అలాంటి నాయకుడిపై కొందరు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఆయనవెంట నాయకులు తిమ్మరాజులు, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ● ఎస్సీ నియోజకవర్గంలో ఎస్సీ ఎమ్మెల్యే స్వేచ్ఛగా ఉండకూడదా? ప్రజలకు సేవ చేయకూడదా? అంటూ కార్వేటినగరం మండల తెలుగు యువత అధ్యక్షుడు తేటి మురళీమోహన్ అన్నారు. సోమవారం కార్వేటినగరంలో మీడియాతో మాట్లాడారు. తాము కూడా ఐదు బస్సుల్లో వెళ్లి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కి ఫిర్యాదు చేయగలమని హెచ్చరించారు. ఇకనైనా దుష్ప్రచారం మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం స్కేల్ ఇవ్వాలి



నగరపాలక కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

చిత్తూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ, నగరపాలక, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం స్కేల్‌ను వర్తింప చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరపాలక కార్యాలయం వద్ద ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. స్కిల్డ్ వర్కర్లకు రూ.29,200, అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.24,600 అమలు చేయాలని, మినిమం టైమ్‌స్కేల్‌ను వర్తింపు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. అనంతరం కమిషనర్ నరసింహ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందించారు. నేతలు శరవణ, శివకుమార్, శివప్రసాద్, వెంకటేశ్, డియా, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం



బాధితురాలి నుంచి అర్జీ అందుకుంటున్న కులశేఖర్ - బాధ్యతలు స్వీకరిస్తున్న లోకేశ్వరి

చిత్తూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా కులశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తుండిన చంద్రశేఖర్‌రెడ్డిని తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. దాంతో కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తుండిన కులశేఖర్‌ను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలిచ్చారు. బాధ్యతలు స్వీకరించిన కులశేఖర్ తన కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఆయనకు కార్యాలయ డీటీ నరేష్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఐరాల: తహసీల్దార్‌గా లోకేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తాను చిత్తూరు రూరల్ నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేసినట్లు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మహేష్‌కుమార్ గతంలో పెనుమూరు నుంచి ఇక్కడికి డీటీగా వచ్చి ఎఫ్ఏసీగా తహసీల్దార్ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఐరాల తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీటీగా విధులు నిర్వహిస్తున్నారు.

తండ్రిపై దాడి కేసులో కుమారుడి అరెస్టు

చౌడేపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై దాడి చేసిన కేసులో కుమారుడు మనోహర్‌ను ఎస్ఐ నాగేశ్వరరావు తన సిబ్బందితో కలిసి సోమవారం అరెస్టు చేశారు. చౌడేపల్లె మండలంలోని ఎ.కొత్తకోటకు చెందిన చిన్నపరెడ్డిపై అతడి కుమారుడు మనోహర్ మార్చి 31వ తేదీన దాడి చేశాడు. కుమారుడి దాడిలో తీవ్రంగా గాయపడ్డ చిన్నపరెడ్డి ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాక ఏప్రిల్ 9వ తేదీన ఇంటికి చేరుకున్నాడు. ఆపై తీవ్ర మనస్తాపంతో ఏప్రిల్ 21వ తేదీన మృతి చెందాడు. భార్య సరస్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మనోహర్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపారు.

నలుగురు సూపర్‌వైజర్లకు సెక్టార్ల కేటాయింపు

గంగాధరనెల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న నలుగురు సూపర్‌వైజర్లకు సెక్టార్లు కేటాయించినట్లు సీడీపీవో పద్మసునంద తెలిపారు. గంగాధరనెల్లూరు సెక్టార్-1కు, తూగుండ్రం సెక్టార్-2కు అనురాధ, తూగుండ్రం సెక్టార్-1కు, గంగాధరనెల్లూరు సెక్టార్-2కు సంగీత, పాలసముద్రం మండలానికి జయశ్రీ, పెనుమూరు మండలానికి సూపర్‌వైజర్‌గా రెడ్డికల్యాణి నియమించినట్లు సీడీపీవో పేర్కొన్నారు.

ద్రౌపది అమ్మవారికి పొంగళ్లు



డప్పులు మోగిస్తూ అమ్మవారికి పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు

వెదురుకుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాలు ఆదివారంతో ముగియడంతో సోమవారం అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మహాభారతం పరిధిలోని పలు గ్రామాల నుంచి మహిళా భక్తులు పొంగళ్లు తెచ్చి పెట్టారు.

ఈ భవనం పూర్తయ్యేదెప్పుడు?



ఆముదాలలో పునాదులకే పరిమితమైన రైతు సేవా కేంద్ర భవనం

పాలసముద్రం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆముదాల సచివాలయం ఆవరణలోని రైతు సేవా కేంద్రం భవన నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వంలో మూడేళ్ల కిందట ఈ భవనాన్ని నిర్మించడానికి రూ.13లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పునాదుల వరకు నిర్మించారు. అప్పట్లో కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సక్రమంగా బిల్లులు మంజూరు చేయక పోవడంతో పనులు ఆపేశాడు. అప్పటినుంచి పనులు తిరిగి మొదలు కాలేదు. పునాదుల చుట్టూ పిచ్చి మొక్కలు, తీగలు పెరిగి పాములకు ఆవాసంగా మారిందని సచివాలయ ఉద్యోగులు, ప్రజలు వాపోతున్నారు. మరోవైపు ఎరువులు, వేరుశనగ పంపిణీ చేసే సమయంలో వీటిని వ్యవసాయ శాఖ అధికారులు అద్దె భవనాల్లో నిల్వ ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా ఈ భవనాన్ని పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాత కక్షలతో మహిళపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలంలోని పాళ్యంపల్లె పంచాయతీ పెద్దగడిదేశికి చెందిన మునిరాజ భార్య లక్ష్మీదేవి (60) ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన రమేష్, మునిరెడ్డి పాత కక్షలతో ఆమెపై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'తల్లికి వందనం'తో ఇంటింటా వెలుగులు : చుడా చైర్‌పర్సన్

చిత్తూరు సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' పథకం ఇంటింటా వెలుగులు నింపుతోందని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ పాలనలో కుదేలైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ, మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతూ ప్రజల మన్ననలు పొందుతోందని పేర్కొన్నారు. ఈ ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

విజయపురం: తల్లికి వందనం పథకంలో లబ్ధి పొందిన ఇష్టకామేశపురంలోని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన హామీని చంద్రబాబు నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రులు లోకేశ్, పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చిత్రపటాలకు కూడా క్షీరాభిషేకం చేశారు. నాయకులు సుధాకర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళ



బ్యాంకుల వద్ద రద్దీ

యాదమరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నగదు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ కావడంతో బ్యాంకుల వద్ద రద్దీ నెలకొంది. శనివారం నుంచి నగదు జమకావడంతో మహిళలు సోమవారం భారీ సంఖ్యలో బ్యాంకులకు చేరకుని నగదు విత్‌డ్రా చేసుకుని సంతోషంగా వెళుతున్నారు.

సంక్షిప్తంగా..

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం



ఆవుదేవర నందీశ్వరస్వామి

వెదురుకుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివ, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ● ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

యాదమరి ఏవోగా దీప



యాదమరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల వ్యవసాయాధికారి (ఏవో)గా దీప సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న చరిత రెడ్డి చిత్తూరుకు బదిలీ అయ్యారు. పుంగనూరులో ఏవోగా పనిచేస్తుండిన దీప ఇక్కడకొచ్చారు.

గుడిపాలకు సంగీత

గుడిపాల: మండల వ్యవసాయ అధికారిగా సంగీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తుండిన మాధవి.. చిత్తూరుకు బదిలీపై వెళ్లగా.. చిత్తూరు నుంచి సంగీత ఇక్కడికి వచ్చారు.


బీజేపీతోనే సుస్థిరపాలన



మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

పూతలపట్టు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో సుస్థిరపాలన సాగుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. మోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. మండల ప్రధాన కార్యదర్శి లావణ్య, ఉపాధ్యక్షుడు సుశీల్ కుమార్, సీనియర్ నాయకులు సోమశేఖర్ చౌదరి, బాలకృష్ణ, భాస్కర్, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి కుప్పం మున్సిపల్ కార్యాలయం



కుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘ కార్యాలయాన్ని సోమవారం నూతన భవనంలోకి మార్పు చేశారు. కుప్పం మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో ప్యాలెస్ రోడ్డులోని పాత భవనంలో కార్యాలయం కొనసాగేది. కుప్పం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యాక పాత భవనాన్ని కూలగొట్టారు. నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం గత నెలలో పూర్తయింది. దీంతో ద్రావిడ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఉన్న మున్సిపల్ కార్యాలయాన్ని సోమవారం నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనంలోకి మార్చారు.